# మాతృత్వ మాధుర్యం

కథ

## ఎ.సువర్ణ

''ఎన్నాళ్లకెన్నాళ్లకు రాణీ ఇంటికి వెళ్లాను. నాలుగేళ్లపైనే అవుతుంది దాన్ని చూసి. దాని పెళ్లిలో చూడడమే. చెన్నైలోనే వుంటున్నా.. ఈ నగరంలోని హడావిడి జీవితంలో స్నేహితులు, చుట్టాలిళ్లకు వెళ్లడం కానీ వాళ్లు రావడం కానీ మహా అపురూపం.

కాలేజీలో కలిసి చదువుకునే రోజుల్లో ఒకరినొకరి వొదిలి వుండేవాళ్లమే కాదు. ఎప్పుడూ అంటిపెట్టుకునే తిరిగేవాళ్లం. అది కాలేజీ మాగ్జైన్లలో కథలు రాసేది. నేను బొమ్మ గీసేదాన్ని. అదే మా ఇద్దరి మధ్య గాఢమైన స్నేహానికి కారణం. మమ్మల్నిద్దరిని కాలం.. నాలుగు సంవత్సరాలు దూరం చేసింది.

''వుసే లవీ నీకు తెలీదే...మావంశీ వున్నాడే వాడు ఆరు నెలలకే అత్త, తాత అంటూ మాట్లాడాడు. ఎనిమిది నెలలకే నడక ప్రారంభించాడు. తప్పటడుగులతో వాడు నడిచే నడక చూసి మాకందరికీ ఒకే భయం ఎక్కడ పడతాడో అని. వాడికి బుర్ర కూడా ఎక్కువేనే. అన్ని సంగతులు తొందరగా తెలుసుకుని అలా చెయ్యాలనే చూస్తాడు. అడుగో చూడు కిటికీ పైకి ఎలా ఎక్కాలా అని చూస్తున్నాడు'' అని రాణి ఆగకుండా కొడుకు గొప్పలు చెప్పుకుపోతున్నది.

ఆడవాళ్లందరూ ఇంతేనా. తల్లి అవగానే తమ మాతృత్వ ఫలాన్ని చూసి ఇలా సంబరపడిపోతారా అని మనసులో అనుకుని, దాని కొడుకుని మెచ్చుకున్నట్లుగానూ, ఆశ్చర్యపోతున్నట్లుగానూ-

''అహ...అలాగా..ఫెంటాస్టిక్.. ఇంతకీ మీ బాబు పేరు..?'' అడిగాను.

''అదేనే ముందే చెప్పానుగా.. వంశీ. మా వంశోద్ధారకుడు'' అన్న ఆమె మొహంలోని వెలుతురుని ఏ సూర్యుని వెలుగుతో పోల్చను?


''మరి నేను బయలుదేరనా!'' అని నేనన్నదానికి,''వాడేం చెప్పినా ఠక్కున చేస్తాడే..'' అన్న రాణి కొడుకు వైపునకు తిరిగి ''వంశీ ఆంటీకి నమస్తే చెప్పు..'' అని తన ధోరణితో బొమ్మలు డబ్బాలుతో ఆడుకుంటు న్న కొడుకుతో అంటే, వాడు తల్లి మాటలు వినపడనట్లే ఆడుకుంటూంటే అదే వెళ్లి వాడిని బలవంతాన ఎత్తుకొచ్చింది. తన ఆనందానికి అడ్డు వచ్చిందన్న కోపంలో తల్లినుంచి తనను బలవంతంగా విడిపించుకెళ్లిపోయి మళ్లీ బొమ్మలు మధ్య కూర్చుని డబ్బాలను కొడుతూ ఆడుకుంటున్నాడు.


''వాడికి మూడ్ వుంటేనే మనం చెప్పినట్లు చేస్తాడే...'' దాని కొడుకు గొప్పలు చెప్పడం ఆగేట్లు లేవని ''రాణీ ఇప్పుడేమైనా రచనలు చేస్తున్నావా..'' అని అడిగా.

''అయ్యో రాత. రాతలు కూడానా..ఒక్కక్షణం తీరితేగా. రోజంతా వీడితోనే సరిపోతూంటేను..''

''మీ అత్తగారు, ఆడబడుచు ఇద్దరూ వున్నారుగా..''

''ఆ...వున్నారు కానీ..నాకెప్పుడూ వాడితోనే వుండాలని వాడొక్క క్షణం కనిపించకపోతే నాకు పిచ్చెక్కినట్లయిపోయి.. రాయడానికే కాదు. కనీసం పేపరు కూడా చదవాలనిపించదే'' అన్న రాణి గబుక్కున కొడుకు నెత్తుకుని పెద్దగా చెప్పుడు చేస్తూ వాడి మొహం అంతా ముద్దులు పెట్టుకుంటున్న దాన్ని చూస్తూ ఈ ఆడవాళ్లందరూ మాతృత్వానికింతగా స్పందిస్తారా? మరి నాకు మటుకు...? పిల్లలింకా పుట్టకపోయినా, తల్లినవడం కోసం కానీ తల్లినవలే






దన్న బాధ కానీ నాలో లేదా?

ఆ సాయంత్రం ఇంటికొచ్చి పెయింటింగ్ చెయ్యాలని బ్రష్ తీసుకుని రంగులలో ముంచి కాన్వాస్ మీదికెళ్లిన నా చేతులు గీసిన బొమ్మలన్నీ ముద్దుల పాపాయిలే..బుల్లి బుల్లి పాపాయిలు, బోసిన వ్వుల పాపాయిలు..నా చెల్లెళ్ల పిల్లలు, ఆయన అక్కబిడ్డలు ఇలా ఎంతమంది పసివాళ్లను చూడలేదూ నేను. అప్పుడే భూమిమీద పడిన లేత శరీరాలు నల్లగా నిగనిగలాడే జుట్టు, బోడిగుళ్లు, తెల్లటి ఒళ్ళు, నల్లటి ఒళ్లు ఆరు నెలల నుంచీ ఎప్పుడు బ్రష్ పట్టుకు రంగులలో ముంచి కాన్వాస్ మీది కెళ్లినా చేతులు పాపల బొమ్మలనే గీస్తున్నాయి. అంటే నాకూ తల్లినవాలని, నా కడుపులోకి ఓ బిడ్డ రావాలన్న కోరికే చిత్రాలు రూపంలో కాన్వాస్ మీది కొస్తున్నారా..?

మూడేళ్ల కిందట...ఒకే వరుస క్రమంలో దగ్గర దగ్గరగా వున్న నాలుగిళ్లలో ఓ ఇంట్లో వుండే వాళ్లం..తతిమా ఇళ్లలోని పిల్లలు..ఒకడు మా ఇంటి కిటికీ చువ్వల మీదికెక్కి కూర్చుని అరిచేవాడు. మరో రెండిళ్లలోని ఇద్దరు పిల్లలు ఇంటి చుట్టూ తిరుగుతూ కేకలు పెడుతూ ఆడే వాళ్ల ఆటలు కేకలు అరుపులు భరించలేక ఓసారి కేక వేసి తిట్టి తరిమేశాను.

రోజంతా ఇంట్లోనే వుండి చిత్రాలు గీసుకునే నాకు వీళ్ల గొడవ వల్ల చిత్రాలు గియ్యలేకపోతున్నాను. కాసేపు ప్రశాంతంగా నిద్ర పోలేకపోతున్నాను. ఈ కిష్కిందాపుర వాసులను రోడ్డు మీదనో ప్లే గ్రౌండ్‌కో వెళ్లి ఆడుకోమన రాదూ...అని అనేసరికి వాళ్లందరూ కలిసి నా మీద ఇంత ఎత్తున ఎగిరిపడ్డారు.

''...చిన్న చిన్న పిల్లల్ని రోడ్ల మీదికి, ఆటస్థలాలకూ పంపకూడదండీ ఆడుకోవడానికి. వాళ్లు మన కళ్ల ముందే ఆడుకోవాలి. వాళ్లాటలు చూస్తూంటే మనకో రకమైన ఆనందం కలుగుతుందండీ లావణ్యగారూ...'' అన్నారు మూడిళ్లలోని పిల్లల తల్లులు నోరంతా ఆనందాన్ని నింపుకుని. అంతటితో ఆగలేదు.

''ఆమెకు చిన్నపిల్లల ఆట పాటలలో వున్న ఆనందం గురించి ఏం తెలీదండి. పాపం పిల్లలు లేరుగా..అదేమిటో.. పిల్లలు లేనివారికి పిల్లలంటే ఎంతో ముద్దు..అభిమానం.. మరేమిటో ఈవిడలా పిల్లల మీద మండిపడుతుంది...'' అన్న కామెంట్లు.

''అందుకే ఆమె కడుపు పండలేదు...ఇంత పక్కగా వుండే ఇళ్లలో వుండే వాళ్ళు ఒకరింట్లో మాట్లాడుకునే మాటలు పక్కింట్లోకి కూడా విన్పిస్తాయి.

ఫ్లాటు కొనుక్కుని ఫ్లాటుకు మారాక పరిస్థితి కొంతవరకు మెరుగైంది. కిటికీ తలుపు తెరిస్తే నీలాకాశం సందడి అంతగా లేని ప్రశాంత వాతావరణమైనా పాత జ్ఞాపకాలు..పాత ఇళ్లలో వున్నవాళ్లు అన్నమాటలే నా చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి. ''పిల్లలు... ఆటలలోని ఆనందం ఆవిడకేం తెలుస్తయి. ఆవిడకు పిల్లలు లేరుగా..'' ఎంత అహంభావం వుందా మాటలలో..కన్నాం అన్న భేషజం...మరి నాకెందుకు పిల్లలు పుట్టలేదు పెళ్లి అయి అయిదేళ్లు దాటిపోయినా, సురేష్ ఉద్యోగం అతన్ని పధ్నాలుగు గంటలు కట్టిపడేస్తుంది. నాకు చిత్రకళా ప్రదర్శనలతోనే కాలం గడిచేదీ తెలీదు.

ఒకటి తరువాత ఒకటిగా వచ్చే ఆర్ట్ ఎగ్జిబిషన్లకు పెయింటింగ్స్ వెయ్యడంతోనే సరిపోతుంది. రాత్రి, పగళ్లు చిత్రాల ఆలోచనలొకటే.. రంగులలో ముంచే కుంచెలు కాన్వాస్ మీదికెక్కించే చేతులు...

ఎగ్జిబిషన్లలో చిత్రాల ప్రదర్శనలు..పోటీలు పొగడ్తలు..పత్రికల విమర్శలు...బహుమతులు..వీటితో ఊపిరి తీసుకునే తీరిక లేకపోవడంతో నేను పిల్లల్ని కనలేదన్న సంగతే గుర్తుకొచ్చేది కాదు. బంధుమిత్రులు గుర్తు చేసేంతవరకూ.

నాకంటే నాలుగేళ్లు చిన్నదైన పిన్నికూతురు నాకు ఉపదేశం చేసింది.

''ఎందుకే అక్కయ్యా ఈ పాడు పెయింటింగ్స్ కోసం.. ఎన్నాళ్లని కనడం వాయిదా వేస్తావు?''

''నాకింకా పిల్లలు కావాలనిపించడం లేదే...నువ్వేం బాధపడకే రాజ్యం. నాకు నలభై ఏళ్లు నిండేంతలోగా ఒకరిద్దరిని కంటాలే..సరేనా..నీకు తృప్తిగా వుందా'' అని న్వాను.

''తొందరగా ఓ బిడ్డను కను..కడుపు పండని బతుకు బంజరు బతుకు..మాతృత్వాన్ని మించిన భాగ్యం మరేదీ లేదు..పెళ్లి అయిన ఒకటి రెండు సంవత్సరాలలో బిడ్డతల్లి అవుతేనే గర్వంగా వుంటుంది.

విజయకు పెళ్లి అయిన పది నెలలలోనే రాంపండు పుట్టాడు. పెళ్లి అయాక ఇంటి పరిస్థితులు ఆర్థికంగా అంత మెరుగ్గా లేవని అది దాని మొగుడు ఇప్పుడుడప్పుడే పిల్లలు వద్దనుకుని ఎంత జాగ్రత్తపడినా రాంపండు గాడు పుట్టేశాడు. దానికింకా పద్దెనిమిది నిండలేదు. ఎగిరి గంతులేస్తూ ఆడుకోవలసిన పిల్ల వయసులో దాని కడుపునో బిడ్డ. గర్భాన్ని మోసి కనవలసిన బాధ్యత వహించక తప్పలేదు విజ్జికి.

''ఇప్పుడీ దరిద్రం ఎవరు కావాలని ఏడిచారు? ఓ సంవత్సరం అయినా ఏ బాదరబందీ లేకుండా హాయిగా వుండకుండా'' అని విసుక్కున్నా. అదే పసినిమ్మపండు ఛాయలో పచ్చటి లేత ఒళ్లు, శాటిన్‌లా మెత్తగా, నల్లగా నిగనిగలాడుతున్న ఒత్తయిన జుట్టుతో అందంగా పుట్టిన శిశువుని చూసుకునేసరికి దాని విసుగుదలంతా హుష్‌కాకి..

''మరెప్పుడు పిల్లలు కావాలనుకోవడం?'' విజ్జి ఉపదేశం నాలో ప్రశ్నించింది.

ఈ తడవ నేను పుట్టింటి కెళ్లినప్పుడు చెల్లెలు రెండో ప్రసవానికని పుట్టింటికొచ్చింది.

అమ్మకు చాలా బాధగా వుంది. తన బాధాతప్తమైన హృదయాన్ని కన్నీళ్ల ద్వారా బయటకు చూపిస్తూ అన్నది.

''నువ్వు పెద్దదానివి, నీకు సూడిదలు చేస్తే నేను హాయిగా కళ్లు మూస్తాను'' అన్న అమ్మ మాటలు నాకు అసహ్యాన్ని కలిగించినయ్యి.

సురేష్ అక్క రాసిన ఆ ఉత్తరంలోని సారాంశం. ''పిల్లలు లేకపోతే దాంపత్య జీవితం గడిపి ఏం ప్రయోజనం..మీరిద్దరూ నాలుగు చేతులా సంపాదించేదంతా ఎవరి కోసం..లావణ్యలో ఏమైనా లోపముందేమో... డాక్టరు చేత పరీక్ష చేయించరాదూ..'' ఆ రెండు మాటలు నా గుండెల్లో ముల్లులా చురుక్‌మని గుచ్చుకుంది.

ఆ రాత్రి సురేష్‌తో అన్నాను. ''ఈ రాత్రి మనం ఓ బిడ్డకు రూపం ఇచ్చి ప్రాణం పోద్దాం..''

''నీ బొంబాయి, కలకత్తా ఎగ్జిబిషన్లు పూర్తిగానీ లావణ్యా. గాలరీలను కూడా బుక్ చేసి పెట్టావు. ఇప్పుడు నువ్వు బిడ్డ అంటే...'' సురేష్‌ని పూర్తి చెయ్యనియ్యకుండానే..

''ఇప్పుడు నాకే ఎగ్జిబిషన్ల మీదా ఇంట్రెస్టు లేదు సురేష్''

''ఇదేమిటి? హఠాత్తుగా ఇంత మార్పు'' అన్న సురేష్ నా చేతుల్లో వున్న వాళ్ల అక్కయ్య రాసిన ఉత్తరం చూసి పెద్దగా నవ్వుతూ..

''ఓహో అదా సంగతి! డాక్టరు చెకప్ చేసి నీలో ఏ లోపం లేదని చెప్పాక ఇంట్రెస్ట్ వస్తుందా?'' అని సురేష్ అడిగేసరికి ఒక్కక్షణం నా తెలివితక్కువ ఆలోచనకు సిగ్గుపడ్డాను.

లోకుల నోళ్లు ముయ్యడానికని నేను బిడ్డను కనాలనుకోవడం లేదు. ఆ అనుభవం..కోసం, ఆ స్పందనకు నేను పులకాంకితురాలునవాలి. ఎగ్జిబిషన్ కోసం పెయింటింగ్స్ అన్నీ కాన్వాసుల మీద కెక్కించాను. నా చిత్ర ప్రదర్శన విజయవంతంగా జరిగేందుకు అన్ని సంసిద్ధతలు చేసుకున్నా. ముందు ఓసారి డాక్టరు దగ్గరకు చెకప్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాము.

డాక్టరు చెకప్‌లు చేసి సురేష్‌తో చెప్పాడు.

''మీవద్ద ఏ లోపం లేదు మిస్టర్ సురేష్. మీరు హండ్రెడ్ పర్సెంటు తండ్రి కావడానికి కావాల్సిన అర్హత

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

లన్నీ వున్నాయ్యి..కానీ..'' చెప్పడానికి కాసేపు సంశయించినా తప్పదన్నట్లుగా, ''సారీ సార్. మీ మిసెస్ గర్భసంచీ పెరగలేదు. చిన్నదిగానే వుంది. అందులో బిడ్డ పెరిగేందుకు అవకాశం లేదు...'' సురేష్‌కు కొట్టినట్లయిపోయాడు. అతను విషాన్ని చేతిలోకి తీసుకుని మింగబోతున్నవానిలా వున్నాడు. అతని మొహమంతా విషాదమే. నేను మూర్ఛపడిపోతుంటే పడకుండా పట్టుకుని దగ్గరకు తీసుకుని గట్టిగా పట్టుకుని నడిపించుకు బయటకు తీసుకొచ్చాడు. కానీ నేను...

మేము కావాలనే పిల్లలు వద్దని జాగ్రత్తలు తీసుకోవడానికి పుట్టే అవకాశమే లేదు అన్న దాని సారాంశం ఒకటే అయినప్పటికీనూ, రెండింటికీ ఎంతో తేడా వుంది. వద్దని ప్రికాషన్సు తీసుకున్నా కావాలి అనుకున్నప్పుడు కనవచ్చును. కానీ అసలు పుట్టరని తెలిస్తే...

## చూపుల్లో కొత్తదనం

**అందం తరిగిపోతుంటే ఏం చేస్తాం. ఆ అందాన్ని పదికాలాలపాటు నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు చూపుల్లో గుచ్చే సే అందాలున్న రక్షిత తన ఫిగర్‌ని మార్చుకోవడానికి లండన్‌కి వెళ్లివచ్చినట్టు వినికిడి. ఛాన్స్‌లు రాక తెగ నీరసపడిపోయి అందంలో మార్పులు కొట్టొచ్చినట్టు కన్పించడంతో ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ముఖాన్ని అందంగా మార్చుకోవడానికి ఆమె ప్రయత్నిస్తున్నట్టు ఉంది. ఈ లండన్ ట్రిప్ ఆమె జీవితంలో ఏ మలుపులు తెస్తుందో చూద్దాం.**

ఎల్లాగైనా నేను తల్లినవాలి. నా గర్భసంచీ పెద్దదవడానికి మార్గాలే లేవా..? అందుకోసం కనిపించిన ప్రతీ డ్యాక్టరు దగ్గరకెళ్లి అడిగాను. ఏ వైద్యాన్నీ వదలలేదు. హోమియోపతి, ఆయుర్వేదం, ఆఖరికి రోడ్డు పక్కనుండే అబద్ధపు డ్యాక్టర్లందరి దగ్గరకూ వెళ్లాను. రాములవారు సీతాదేవి కనపడక, కనిపించిన ప్రతీ పుట్ట చెట్టుని సీతాదేవి జాడను అడిగినట్లుగా.

జరిగిపోయిన ఎన్నో, అమ్మలక్కలు చుట్టుపక్కలందరూ అన్న ఎన్నో చేదు మాటలు లోపలనుంచి సీడీ ప్లేయరులోంచి వినపడుతున్నట్లుగా చెవులలో మారుమోగిన్నయ్యి.

పోయిన వేసంకాలం సెలవులకు సురేష్ అక్కగారి ఊరి కెళ్లాము. ఆమె ఇద్దరు పిల్లలు సురేష్‌కు బాగా చేరికయారు.

మామయ్యా బిస్కట్లు కొనిపెట్టు, చాక్లెట్లు కొనియ్యి, ఐస్‌క్రీం కావాలంటూ చూసినవన్నీ సురేష్‌చేత కొనిపించుకున్నారు.

ఆఖర్న రిమోట్‌తో వెనక్కి ముందుకీ నడిపించే బ్యాటరీ ఆపరేటింగ్ కారు, అయిదువందలు ఖరీదు చేసే కారు సురేష్‌చేత కొనిపించుకున్నాక ఆయన బావగారు సంకోచపడుతూ, ''సురేష్ ఎందుకంత ఖరీదు పెట్టి ఆ బొమ్మలు కొంటావు?'' అని మందలించేసరికి అక్క మధ్యలో జోక్యం చేసుకుని, ''చెయ్యనియ్యండి..తన పిల్లలకంటూ కొనే అదృష్టం ఎలాగూ లేదు. వీళ్లకు కాకపోతే మరెవరికి కొనిపెడతాడు మా తమ్ముడు..'' అన్న ఆమె మాటల ధోరణి నన్నవమానపరుస్తున్నట్లనిపించింది.

మరో చేదు అనుభవం..వరలక్ష్మీ వ్రతానికని చెల్లెలికి మూడువేలు ఖరీదు చేసే మైసూరుసిల్కు చీర కొనిచ్చాను, అది చూసి సంబరపడిపోతుందని. దాని మొహంలో కనిపించే సంతోషాన్ని చూడాలనుకున్నాను. కానీ నేననుకున్నట్లుగా ఏ సంతోషం వ్యక్తం చేయకపోగా ముభావంగా వుండిపోయింది.

''ఇప్పుడేం అంత పెద్ద విశేషం అని? అంత ఖరీదు పెట్టి దానికి సిల్కు చీర కొనిచ్చావ''ని అమ్మ అంటే అందుకు చెల్లెలు చెప్పిన సమాధానం, ''దానికేమే అమ్మా...ఓ పెయింటింగ్ అమ్మిందంటే వేలకు వేలు వచ్చి పడతయ్యి..బావగారేం తక్కువ సంపాదిస్తున్నారా.. రెండు చేతులా సంపాదిస్తున్నారు. లింగులిటుకుమంటూ మొగుడు పెళ్లాలిద్దరే...పిల్లా పీచు లేరు ఖర్చు చేసేందుకు...''



'నేనేం పికాసోనా, ఎమ్.ఎఫ్.హుస్సేన్‌నా నా పెయింటింగ్స్ వేలకు వేలు అమ్ముడుపోవడానికి?' దాని మొహంలో నేను చూసింది ఏ భావం.. నాకు పిల్లలు లేరని దెప్పిపొడుస్తున్నదా..నేను మంచి పెయింటర్‌నన్న ఈర్ష్య.. తనకి వద్దంటున్నా పుట్టుకొచ్చే పిల్లల వల్ల కలిగే అసౌకర్యాలకు బాధా..నాకుమల్లే తనకే కళలోనూ ప్రావీణ్యం లేదన్న బాధా..ఏం భావం..ఆ..ఏం భావం అది..?

ఈసారి నా చిత్రకళా ప్రదర్శనలో ప్రదర్శించిన చిత్రాలు ముఖాలలో కనపడే భావాలన్నీ అవే....నాకు సూడిదలు చెయ్యాలని ఎదురుచూసే అమ్మ. కడుపులో బిడ్డతో ఎత్తున నిలబడి ఉపదేశాలు చేసే విజ్జి, వేసంకాలం ఎండలలో బాలెంత అయినా చెవులతో సహా మఫ్లరుతో తలకు కట్టుకున్న మఫ్లరుతో చెల్లెలు, ఇద్దరు పిల్లల్ని కనేసరికి లావెక్కిన సురేష్ అక్కయ్య, వీళ్లందరి రూపాలు కావు, వీళ్ల మొహాలలో కనిపించే భావాలతో గీసిన చిత్రాలే.

ఈ తడవ ఎగ్జిబిషన్‌లో నా చిత్రప్రదర్శనకు అనుకున్నదానికంటే ఎక్కువగా మెప్పుల వర్షం కురిసింది. ఫస్టు బహుమతి లభించింది.. ఎలా..ఎలా..?

నా పెయింటింగ్స్ కేవలం చిత్రాలే కావు...వాళ్లు వీళ్లు నాకు పిల్లలు లేరని అన్న మాటలు నాలో కలిగించిన బాధకు స్పందన తోడై చిత్రాలుగా కాన్వాస్ మీదికెక్కారు నన్ను దెప్పిపొడిచిన వాళ్లందరూ.

మొట్టమొదటిసారిగా అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను, చేదు అనుభవాలు కూడా కళాస్పందనతో గొప్పగా చిత్రించగలనని.

నూతనోత్సాహంతో నాలోని బాధను మరిచిపోవడానికి కొత్త కొత్త చిత్రాలను గీస్తూ నా శరీరంలోని లోపాన్ని నేను మరిచిపోయినా నా చుట్టుపక్కలవాళ్లు చుట్టపక్కాలు మరిచిపోనియ్యకుండా గుర్తు చేస్తున్నారే!

ప్రతీరోజా పిచ్చాపాటీగా మాట్లాడుకునే మాటల్లోనూ నా గొడ్రాలుతనం గురించిన మాటలే.

గోపాల్ పెళ్లిలో మామయ్య కూతురు కలిసింది.

''ఎలా వున్నావు?'' అని కుశలం విచారించాను.

''ఆ..ఏదో ఇలా వున్నాను..'' విరక్తిగా సమాధానం చెప్పింది.

''పాపేది?'' ఒక్కత్తే వచ్చిన దాన్నడిగాను.

''అయ్యో..అదేం అడుగుతావు..పెద్దదానికి రెండు రోజులు కిందటదాకా లూజ్ మోషన్సు..పెళ్లి భోజనం తింటే పడదని ఇంట్లోనే వదిలేశాను. చిన్నదానికి ఎప్పుడూ ఏదో నలత...''

''పిల్లలన్నాక ఇవన్నీ సహజం..అన్నీ సర్దుకుంటయ్యి. నువ్వేం దిగులు పడకు'' అని ఓదార్పు మాటలు చెప్పాను. ఓహ్...అందుకది-

''నీకేం అమ్మా నువ్వెన్నైనా చెప్తావు. నువ్వు

పుణ్యాత్మురాలివి. నీకే జంజాటమూ లేదు. పిల్లలు పుట్టరన్న ఒక్కటీ తప్పు'' అన్న మాటలలో నాకు పిల్లలు కలుగరని దెప్పడంతోపాటు తను ఇద్దరిని కన్నా నన్న గర్వమే ఎక్కువగా ధ్వనించింది.

ఒకవేళ అది నా భయమేమో..

''మరొకర్నో ఇద్దరినో కనకపోయావా..'' అని అన్నట్లుగా అడిగాను. అనుకోని నా ప్రశ్న వల్ల దానికి చికాకు, ఆందోళన మొహంలో కొట్టొచ్చినట్లు కనిపించింది. మొహం ముడుచుకుని మరో చోటికెళ్లి అది అక్కడున్నవాళ్లకి నన్ను చూపిస్తూ ఏదో అని చెవులో గుసగుసలాడింది.

ఆరోజు రామ్‌లాల్ పార్టీ...కింది పాదాల నుంచి పైన శిరస్సు వరకూ నగలతో అలంకరించుకుని హడావిడిగా జనం మధ్య తిరుగుతున్న భార్యను పిలిచి నన్ను పరిచయం చేశాడు రామ్‌లాల్.

''షీలా డార్లింగ్. ఈమె లావణ్య. గొప్ప చిత్రకారిణి. రవివర్మ అంత గొప్పగా చిత్రాలు గీస్తుంది డియర్..'' అని నన్ను షీలకు పరిచయం చేశాక కాసేపు మేమిద్దరము మాట్లాడుకున్నాము. కాసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నాక షీలగార్ని-

''మీ హాబీస్ ఏమిటండీ?'' అని అడిగాను.

''ఆ..ఏమీ లేదు..భోజనం చెయ్యడం నిద్రపోవడం అంతే...'' అన్న భర్త మాటలకు కాస్త ఫీలైంది షీల. సిగ్గుతో మొహం ఎర్రబడిందామెకు.

హాబీలనేవి ఏవీలేకుండా జీవితం గడుపుతున్నానన్న భావం వున్నా ''కాలేజీ రోజుల్లో డ్యాన్సు బాగా చేసే దాన్ని. కాలేజీలో ఏ ఫంక్షన్లు జరిగినా నా డ్యాన్సు ప్రోగ్రాం తప్పకుండా వుండి తీరేది. పెళ్లి అయి పిల్ల పాప పుట్టాక వీటన్నింటికి తీరికేది?'' తన సమాధానంలోని న్యాయాన్ని సమర్థించుకున్నట్లుగా తన పర్‌ఫామెన్స్‌కు వచ్చిన బహుమతులు పొగడ్తలు కష్టపడి గుర్తుచేసుకు చెప్పింది షీల.

''నేనైతే నాట్యం వదిలేశాను కానీ నా కూతుర్ని శోభానాయుడు, పద్మా సుబ్రమణ్యం అంతటివాళ్లను చేస్తాను'' అంటూ ఆమె తన అయిదు సంవత్సరాల కూతుర్ని దగ్గరకు తీసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుని జుట్టు సవరించింది.

''మీరు వదిలేసినట్లే మీ బిడ్డా ఒక బిడ్డ పుట్టగానే డ్యాన్సు వదిలేస్తే'' వూరికే వుండకుండా ఈ పాడు నోరు అడిగింది.

ఒక్కక్షణం కల చెదిరిపోయిన దానిలా ఉలిక్కి పడినట్లయి, వెంటనే ''మీకైతే సరిపోయింది. పిల్లా పాపా లేదు కనుక ఏ బెదడాలేకుండా ఇంత వయసొచ్చినా హాయిగా చిత్రాలు గీస్తున్నారు. డబ్బు సంపాదిస్తున్నారు'' అని ఆమె అనేసరికి నాకు తగిన శాస్తి అయిందిలే అనిపించింది.

తమకు తీరని ఆశలు, ఆశయాలు, కన్నకలలు తమ పిల్లల వల్ల ఎలా తీర్చుకోవాలన్నదే వారి తాపం. తమకు ఈడేరని, నెరవేరనివి నెరవేర్చుకునేందుకు, తమ జీవితాలకు మబ్బుతెరలులా అడ్డం వచ్చి నెరవేరకుండా చేసిన తమలోని శక్తి సామర్ధ్యాలని నిరూపించుకునేందుకు పిల్లలే అని వారి గాఢనమ్మకం. అది కార్యరూపంలోకి వచ్చేసరికి వేరే మాదిరిగా పరిణమిస్తుంది.

ఆఖరున మరో అనుభవం. నా ప్రాణ స్నేహితురాలు శశికి కూతురు పుట్టి పూర్తిగా సంవత్సరం కాలేదు. అంతలోగా తనకు రెండు నెలల గర్భవిచ్ఛేదం అయింది. రెండునెలలు రెస్టు కావాలని అబద్ధపు సర్టిఫికెట్టు తెచ్చి ఇచ్చి ఇంట్లో వుండడం ఆశ్చర్యాన్నే కలిగించింది. అది ఎందుకలా చేసిందీ దాని నోటితోనే చెప్పింది. ''కూతుర్ని వదలి ఆఫీసుకు రాబుద్ధి పుట్టక అలా చేశానని..''

''శశీ ఇంత పంక్చ్యువల్ ఆఫీసరువి. నువ్వే ఇలా..''

''లవీ, నీకు కడుపుతీపి గురించి తెలీదే...'' అని ఏమాత్రం ఆలోచించకుండా అనేసింది.

ఆ రాత్రి నిద్రరాక చాలాసేపు బెడ్‌మీద అటు ఇటు పొర్లిగింతలు పెట్టాను.

''బిడ్డ..బిడ్డ..రాణీ రచనలు మానెయ్యడానికి కారణం బిడ్డ.. శశి దొంగ సర్టిఫికెట్టు తీసుకోవడానికి కారణం బిడ్డ.. విమల పని చేస్తున్న ఆఫీసు నుంచి వారంలో మూడురోజులు సాయంత్రాలు ఏదో కారణం చెప్పి ఇంటికి తొందరగా వచ్చెయ్యడానికి కారణం బిడ్డ.. ఆఖరికి నా ఈ సాధనకంతా కారణం నాలోని గొడ్రాలుతనమే కారణం అంటున్నారు.

ఈమధ్య నేను నేనుగా లేను. అందరి సూటీ పోటీ మాటలు మనసుకు గుచ్చుకుని గుచ్చుకుని లోపలంతా దహించుకుపోతున్నది. నా మనసుని బాధపెట్టే మాటలనకూడదనే ఇంగిత జ్ఞానం ఎవరికీ లేదు. పెళ్లి అయినా నాకు పిల్లలు పుట్టకపోవడం మహాపరాధం అన్నట్లు నేరస్థురాలిని చేసి విట్‌నెస్ బాక్సులో నిలబెట్టారే. నాలో స్త్రీత్వం లేదన్నట్లు జాలిగా చూస్తున్నారు.

ఎవరినైనా పిల్లల్ని ముద్దుగా దగ్గరకు తీసుకు ముద్దు పెట్టుకుంటే దిష్టి తగిలిందని మొహం మీదనే అనడంతో ఆపక, పిల్లల రెండు బుగ్గలను తమ రెండు చేతులతో తాకి తమ తల పక్కన ఆనించి మెటికలు విరిచి దృష్టి పరిహారం చేస్తారు. ఈ ప్రపంచంలోని మనుష్యులెంత విచిత్రమైనవారు.

చెయ్యో, కాలో బహిరంగంగా కనిపించే అంగవికలురిపై మాత్రం బోలెడంత జాలి, సానుభూతి ఒలకబోస్తారుకానీ, అది వాళ్ల తప్పన్నట్లుగా దెప్పి పొడవరెవరూ! బయిటకు కనిపించని నాలోని గర్భసంచీ వైకల్యం ఎంత మంది అవహేళనలకు నన్ను గురిచేసింది.




తెల్లవారి ఎనిమిది గంటలైనా ఇంకా బెడ్ మీదే పడుకుండడం చూసిన సురేష్ కంగారుపడుతూ దగ్గరకొచ్చి నుదుటిమీద చెయ్యి వేసి, జ్వరం లేదని తెలుసుకుని ''వాట్ డియర్..ఇంకా పడుకునే వున్నావేమిటి? ఢిల్లీలో ఎగ్జిబిషన్‌కు చిత్రాలు గియ్యడం పూర్తయిందా.. డేట్ దగ్గర పడుతోంది.''

''సురేష్, నేనీ ఎగ్జిబిషన్‌లో పార్టిసిపేట్ చెయ్యను. నాకు మూడ్ లేదు. నన్ను విసిగించకు..'' అని మరో వైపు తిరిగి పడుకున్నాను.

''లావణ్యా, నేనూ నిన్ను కొన్ని రోజులుగా గమనిస్తూనే వున్నాను. ఈమధ్య నువ్వు పూర్తిగా మారిపోయావు. అందరి మీదా విసుక్కుంటున్నావు. నీకు కోపం ఎక్కువైంది. ఎప్పుడూ ఎవరి మీద విరుచుకుపడదామా అనే చూస్తున్నావు, నీకేమైంది?''

''నాకేం అవలేదు. నాకో బిడ్డకావాలి...''

''చాలా బాగుంది తల్లీ నువ్వనేది...అందని దానికే అర్రులు చాచడం ఏమిటి..డాక్టరు నీకు పిల్లలు పుట్టే అవకాశం లేదని చెప్పక ముందర ఈ బిడ్డ కావాలని నువ్వెప్పుడూ అనలేదే..ఇదేమిటీ పేరాశ?''

''ఏం నీకు లేదా పిల్లలు కావాలని? లోపం నాలోనేగా...''

''లోపం ఎవరిలో వుంటే ఏం...అంతగా పిల్లలు కావాలంటే అనాథ శరణాలయం నుంచి ఓ బిడ్డను తెచ్చి పెంచుకుందాము.''

''ఆ..అలాగే అంటావు..ఈ మాటలన్నీ పై పై మాటలే. ప్రతీ మగాడు తన రక్తమాంసాలలోంచి పుట్టిన బిడ్డే కావాలనుకుంటాడు.''

''వుండచ్చు...అనుకోవచ్చు కూడా..అలాంటి మగాళ్లతో నన్ను పోల్చకు. మనకు పిల్లలు కలగరన్న విషయాన్ని భూతద్దంలోంచి చూడాలా?''

''నువ్వు మరో పెళ్లి చేసుకోరాదూ..''

''షటప్...''

చెంప ఛెళ్లుమనేంత పని చేశాడు సురేష్.

''నాలోనే లోపం వుంటే... ఎంతమందిని పెళ్లి చేసుకున్నా ఏ ఒక్కరిని తల్లిని చెయ్యలేను.''

''నిజం చెప్పు సురేష్. నీ వంశాన్ని నిలిపేందుకు వారసుడు కావాలనిపించడం లేదూ...'' అన్న నా మాటలకు సురేష్ పెద్దగా నవ్వుతూ-

''పిచ్చిపిల్లా..పిచ్చిపిల్లా.. మనదేం చంద్రవంశమా? సూర్యవంశమా? ఇక్కడే రత్నసింహాసనం ఎదురుచూస్తోంది వారసుడి కోసం?...ఆ? పిచ్చిదానిలా నువ్వే ఏదేదో ఊహించేసుకుని బాధపడిపోకు.. ఢిల్లీ ఎగ్జిబిషనుకు ఎక్కువ వ్యవధి లేదు. ఆ ఎగ్జిబిషను పూర్తి అయి తిరిగొచ్చాక, అప్పుడు పిల్లలు కావాలనిపిస్తే అప్పుడు అనాథ శరణాలయం నుంచి ఓ

బిడ్డను తెచ్చి పెంచుకుందాము. అంతే..కానీ మాతృత్వం అని నవమాసాలు మొయ్యడం, ప్రసవ వేదన భరించి పిల్లల్ని కనడం అనేవి ఏవీ మన ఆదర్శాలకో, చేసే పనులకో అడ్డు అవకూడదు.''

''నీకేం సురేష్. నువ్వు మగాడివి. ప్రకృతి నీకు పిల్లల్ని కడుపులో మోసి కనే బాధ్యత ఇవ్వలేదు. అందుకని తేలికగా అనేశావు.. కానీ నేను ఆడదాన్ని కదా..ప్రకృతి పిల్లల్ని కనే బాధ్యత మా ఆడవాళ్ల మీద పెట్టింది. ఆ బాధ్యతను నెరవేర్చకపోతే ఏదో గిల్టీ కాన్షస్‌గా వుంది సురేష్...''' అన్న నా మాటలకు ఓ చిరునవ్వు నవ్వి ''లే...ఫ్రెష్ అప్ అవు..'' అని సురేష్ నా చెయ్యి పట్టుకు లేవదీశాడు.

నా మనసులోని అనుమానాలన్నీ పోయి దృఢంగా అయింది. పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టబెట్టి, మనసుకు కళ్ళెం బిగించి, విచారాలనే అలలను అదుపులోకి తెచ్చుకున్నాను.

అద్దంముందు కూర్చుని అలంకరించుకున్నప్పుడు, సున్నితమైన ఊహలను బ్రష్‌తో కాన్వాస్ మీది కెక్కించేప్పుడు, మా ఆయన గుండెలపైన తల ఆనించి ఆయన గుండెల చప్పుడు వింటున్నప్పుడు. ఇప్పుడంతా నా స్త్రీత్వంలో, ఏదో లోపం వుందనిపించడం లేదు.

దెప్పుళ్లు, తిట్లు, అనుతాపాలు నిన్న జరిగిపోయినవిగా మరిచిపోయి ఉత్సాహకరమైన రోజుల వైపుగా అడుగులేస్తున్నాను.

ఆ రోజు సోమవారం. సురేష్ ఎనిమిది గంటలకే ఆఫీసుకెళ్లిపోయాడు. పనులన్నీ పూర్తిచేసుకుని కుంచెలు రంగులు పట్టుకుని కాన్వాస్ ముందు కూర్చున్నాను. పరిసరాలను మరిచిపోయి తన్మయత్వంతో నాలో కలిగిన భావాలను కాన్వాస్ మీదికెక్కిస్తున్నాను.

వాకిటి తలుపు మెల్లిగా కొట్టే చప్పుడు నా గుండె చప్పుడనుకున్నాను మొదట్లో. పెద్దగా బాదడం వినిపించాకే అది తలుపు చప్పుడని, ఎవరో తలుపు కొడుతున్నారని లేచి వెళ్లి తలుపులు తెరిచాను.

రెండేళ్ల కొడుకుని చంకలోను, ఏడునెలల భ్రూణాన్ని కడుపులోనూ మోస్తూ విజ్జి వాకిట్లో నిలబడుంది.

''ఏం చేస్తున్నావు...ఎంత సేపటినుంచీ తలుపులు కొడుతున్నానో తెలుసునా లావణ్యా..''

''సారీ విజ్జీ...ఢిల్లీలో జరగబోయే ఎగ్జిబిషనుకు...'' అని నేను ప్రారంభించి పూర్తి చెయ్యకముందే నోరంతా తెరిచి పెద్దగా ఆవలించింది.

నేను దీనికి నా పెయింటింగ్స్ గురించి చెప్పబోయానే..నా బుద్ధి తక్కువని నా చెప్పుతో కొట్టుకోవాలి..మేమిద్దరం ఉత్తర దక్షిణ ధృవాలం..మా ఆలోచనలెప్పుడూ కలవ్వు.

అంతలోగా దాని కుమారుడు తడి తడిగా వున్న కాన్వాస్ మీద వాడి చేతి ముద్రలు ముద్రించాడు.

నేను కంగారుగా.. ''వురేయ్..వురేయ్.. అది మురికి చెయ్యకూడదురా నాన్నా..'' అని వాడిని ఎత్తుకునేసరికి వాడు పెద్దగా ఆరున్నొక్కరాగం తియ్యడం మొదలుపెట్టాడు. వాడిని వంటింట్లోకి తీసికెళ్లి డబ్బాలోంచి బిస్కట్లు తీసి వాడి చేతిలో పెట్టి తీసుకొచ్చి కూర్చోబెట్టాను.

కొడుకు ఏడుపు అలవాటే విజ్జికి. కాసేపు వాడిని కేకలేసింది. అంతటితో ఆగక ఇంట్లో అత్త, ఆడబడుచులు పెట్టే ఆరళ్లు చిలువలు పలువలు చేసి వర్ణించి చెప్పింది. ఆఖరికి అటుతిప్పి ఇటుతిప్పి మళ్లీ నా మీదకు నా తల్లితనం మీదకు తిరిగింది.

''ఇదిగో చూడక్కా...ఎవరైనా మంచి డాక్టరుని కలువకపోయావా?'' అన్న దాని మాటలకు ఇదివరకటిలా బాధపడలేదు.

''చూపించుకున్నామే విజ్జీ!''

'' అలాగా.. అయితే ఏం చెప్పారు..'' ఉత్సాహంగా అడిగింది.

''నేను గర్భం ధరించలేను..'' అని నేననేసరికీ దాని ఉత్సాహం అంతా నీరుకారిపోయింది.

''అలా అని ఏ డాక్టరు చెప్పారక్కా.. పిన్ని నీ జాతకాన్ని మంచి జ్యోతిష్కులకు చూపిస్తే నీకు సంతాన యోగం వుందని చెప్పారని చెప్పింది. అది కూడా ఒకరిద్దరు కాదు ముగ్గురు పిల్లలు పుడతారని చెప్పారుట. వాళ్ల మాటలు అబద్ధాలు కావే. నేను నీకెన్నోసార్లు చెప్పాను, నువ్వూ బావగారు రామేశ్వరం వెళ్లి నాగప్రతిష్ఠ చేసి రమ్మనమని. నా మాట వినిపించుకున్నావూ!''

నేను దాని మాటలకు నవ్వుతూనే ''నాలో లోపం పెట్టుకుని ఎన్ని నాగప్రతిష్ఠలు చేసినా ఏం లాభం లేదు..మేమిద్దరము ఓ బిడ్డను దత్తు తీసుకుందామనుకుంటున్నాము..''

''ఎవరో కన్నపిల్లలు మన కన్నపిల్లలవుతారా అక్కా..?''

''మనం కన్నపిల్లలే మన్ని చూస్తారన్న గారెంటీ వుందా విజ్జీ..'' ప్రశ్నతోనే దాని ప్రశ్నకు సమాధానం చెప్పాను.

''సుబ్రమణ్యం మామయ్య పరిస్థితి నీకు తెలిసిందేగా! ఇద్దరు కొడుకులు వున్నా ఆస్తంతా పేకాట, రేసులు, తాగుడుతో తగలేసి తల్లిదండ్రులను రోడ్డు మీద నిలబెట్టలేదూ..!''

''పుట్టిన పిల్లలందరూ అలాగే వుండరే...ప్రయోజకులైన పిల్లలు లేరూ..''

''విజ్జీ, మా తరువాత ఆస్తికి వారసులు కావాలనేంత ఆస్తులేవీ లేవు. మాకు తలకొరివి పెట్టాలనో, వంశం నిలబడాలన్న పట్టింపులు మా ఇద్దరికీ లేవు. కానీ నాకు మాత్రం బిడ్డను నవమాసాలు కడుపులో మొయ్యాలి..మధురమైన వేదనను, అదే పురిటి నొప్పులు పడి బిడ్డకు నేను జన్మనివ్వాలి..ఆ అనుభవాల కోసమే నా తాపత్రయం అంతాను. ఆ అనుభవం కళాపూర్వకంగా నన్ను పరవశింపజేస్తుంది...'' అని నేనింకా చెబుతూండగానే బాబు చేతుల్లోని బిస్కట్లు నేలకేసి కొట్టి మళ్లీ కాన్వాస్ మీదికి దండెత్తాడు. తడి పెయింటు మీద చేతులు పెట్టి చేతులంతా పెయింటు పూసుకున్నాడు.

''వురేయ్..వురేయ్..బాబూ.. పెయింటింగంతా అలా తుడవకూడదు బాబూ..నీకు ఇంకో పేపరిస్తాగానీ ఇలారా నాన్నా..'' అని బాబుని మెల్లగా నావైపుకు తీసుకొద్దామని చెయ్యి పట్టుకున్నాను. అంతే..పట్టుకున్న చెయ్యి విడిపించుకుని హైపిచ్‌లో, ఏడుపు లంకించుకుని వాళ్ల అమ్మవైపుకు పరిగెత్తాడు.

''ఇవ్వాళంతా వీడు ఏడుపు ఆపడక్కా...మీ మరిది గారి తమ్ముడుకు కొడుకు పుట్టాడు. వాడికి రేపు బారసాల, నామకరణం. పిలిచి వెడదామని వచ్చాను'' అని బొట్టు పెట్టి ''పొద్దున్నే బావగారు నువ్వు తప్పకుండా వచ్చెయ్యండి'' అని విజ్జి బయలుదేరితే దాన్ని సాగనంపడానికని నేను దాని వెనక్కాలే నడిచాను.

విజ్జి...రెండేళ్ల పిల్లాడి చెయ్యి పట్టుకుని ఏడుమాసాలు గర్భాన్ని మోసుకుంటూ గేటుదాటుతున్న విజ్జీనే చూస్తున్నాను. అది పక్క సందు తిరిగి కనుమరుగయ్యేంత వరకూ చూసి లోపలకొచ్చాను.

విజ్జి కడుపులో వున్న ఏడు మాసాలు శిశువు నా కళ్ల ముందు కొచ్చింది.

'లక్షలాది జీవకణాలు నేనంటే నేనని ఒకదానితో ఒకటి పోటీ పడిన వాటిల్లో ఒక్కటి మాత్రం గెలిచి ముందుకెళ్లి లోపల ప్రవేశించి అక్కడ తనకోసం కాచుకున్న అండంతో కలిసి తొమ్మిది నెలలు గర్భవాసం చేసి, బయటి ప్రపంచంలోకి రావడానికి తనను మోసిన తల్లిని అతికష్టమైన నొప్పుల మధ్య శిశువు బయట ప్రపంచంలోకి వస్తుంది.

శిశువుని ప్రసవించే బయట ప్రపంచాన్ని లోపలి ప్రపంచాన్ని కలిపే ఈ అనుభవం వుందే...ఓహ్..అది అనుభవించిన తల్లి అయినా వర్ణించగలదా.. లేదు..కానీ..నేను జీవితంలో అనుభవానికి రాని అనుభవాలెన్నింటినో ఊహించి కాన్వాస్ మీద ఎంతో సుందరంగా చిత్రిస్తున్నాను' అని గర్వంగా అనుకునేసరికి ఆ రాత్రి సురేష్ అన్నమాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించినయ్యి.

''లావణ్యా డియర్! నూటికి తొంభై తొమ్మిది మంది స్త్రీలు గర్భవతులవుతారు. పిల్లల్ని కనగలిగే శక్తిమంతులే.. కానీ నీ మాదిరిగా బ్రష్ పట్టుకుని ఎన్నో అద్భుతమైన సుందర దృశ్యాలను కాన్వాస్ మీది కెక్కించగలిగిన వాళ్లెంతమంది వున్నారో..''

జీవితంలోని విశేషాలన్నీ కాన్వాస్ మీది కెక్కించడం సాధ్యపడే విషయమా..

విజ్జి పి.యూ.సి. తలకిందులుగా నిలబడి తపస్సు చేసి పాసైంది.

తరువాత పెళ్లి చేసుకుంది. పిల్లల్ని కన్నది. తరువాత భోజనం-నిద్ర, భోజనం-నిద్ర, అని జీవిత చక్రం దొర్లిస్తున్నది.

అందరూ అన్నిరకాల అనుభవాలను అనుభవించేందుకు జీవితం అంత విశాలమైందా ఏమిటి?

గబుక్కున తతిమా ఆలోచనలన్నీ వేరు వైపునకు తిప్పాను.

కుంచెను తడి చేసి బాబు తన బుల్లి చేతులతో తుడిచేసినదంతా పూర్తిగా చెరిపేశాడు.

బయట సంధ్య చీకట్లు కమ్ముకుంటూంటే, నా కాన్వాస్ మీద ఎర్రరంగులో సూర్యుడు ఉబ్బిపోతూ ఉదయిస్తున్నాడు.

☆